ఎలగందల్ టైమ్స్
సంపుటి : 01
సంచిక : 245
ప్రతి అక్షరం ప్రజల కోసం..



# కాంగ్రెస్ ఫ్లెక్సీయా.. వీల్లేదు

మారుతీనగర్‌లో తొలగించిన సిబ్బంది

టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ నిర్వాకం

అదనపు కలెక్టర్‌కు కాంగ్రెస్ ఫిర్యాదు

(కరీంనగర్, ఎలగందల్ టైమ్స్)

కరీంనగర్ మున్సిపల్ యంత్రాంగం ఇంకా బీఆర్ఎస్ పాలన నుంచి తేరుకున్నట్టుగా కనబడటం లేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు వారాలు దాటగా.. కరీంనగర్ మున్సిపల్ యంత్రాంగం ఇంకా ఆ పార్టీని ప్రతిపక్షంగానే చూస్తున్నట్టుగా తాజా సంఘటన చాటుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు రంగంలోకి దిగారు. ఇప్పటికే ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం కూడా ప్రజా పాలన సభల వద్ద కాంగ్రెస్ నాయకులు చొరవ తీసుకొని ప్రజలకు దరఖాస్తుల సమయంలో ఇబ్బందులు కలగకుండా సహకరించాలంటూ సూచనలు చేశారు. ఈ మేరకు నగరంలోని పలు డివిజన్లలో రెండు రోజులుగా ప్రజాపాలన సభలు సజావుగా సాగుతున్నాయి. నగరంలోని అన్ని ప్రజాపాలన సభల వద్ద కాంగ్రెస్ నేతలు ఇప్పటికే ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే మారుతీనగర్‌లో మాత్రం భిన్నమైన పరిస్థితి నెలకొన్నది. 30వ డివిజన్‌లో శనివారం జరగనున్న ప్రజాపాలన సభకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర నేతల ఫోటోలతో ముద్రించిన ఫ్లెక్సీని మారుతీనగర్ చౌరస్తా వద్ద డివిజన్ అధ్యక్షుడు దొంతి గోపి ఏర్పాటు చేశారు. అయితే మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది ఆ ఫ్లెక్సీని తొలగించివేశారు. దీనిపై గోపి అక్కడే ఉన్న కార్పొరేటర్‌ను ప్రశ్నించగా.. టౌన్ ప్లానింగ్ సిబ్బంది రాజ్‌కుమార్ తొలగించారంటూ సమాచారం ఇచ్చారు.



దీంతో విషయాన్ని కాంగ్రెస్ నేతలకు వివరించగా.. పలువురు నేతలు మారుతీనగర్‌కు చేరుకొని రాజ్‌కుమార్‌ను నిలదీశారు. దీంతో తనకు కూడా సంబంధం లేదని.. శానిటేషన్ జవాన్ సంజీవ్ సూచన మేరకు సిబ్బంది తొలగించారంటూ రాజ్‌కుమార్ తప్పించుకున్నారు. దీంతో కాంగ్రెస్ నాయకులు సంజీవ్‌ను ఫోన్‌లో నిలదీయగా.. తనకు సంబంధం లేదని తొలుత బుకాయించినా.. తర్వాత తానే తొలగించానని.. తనకు ఎవరూ ఏం చేయలేరంటూ కాంగ్రెస్ నేతలపై దాడికి దిగారంటూ నేతలు చెబుతున్నారు. ఘర్షణ వాతావరణం చోటు చేసుకునే క్రమంలో మున్సిపల్ సిబ్బంది వారించి పంపించివేయగా.. పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ అమీర్ దొంతి గోపి తదితరులు జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్‌కు ఫిర్యాదు చేశారు. బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలంటూ కోరారు.





# కమీషన్ల.. కాళేశ్వరం

- ప్రాజెక్టు పూర్తి అవినీతిమయం
- మా అనుమానాలు నిజమయ్యాయి..
- నిర్మాణంలో భారీగా అవకతవకలు
- మేడిగడ్డ సందర్శనలో మంత్రుల బృందం ధ్వజం
- ప్రాణహిత-చేవెళ్ల నిర్మించి వినియోగంలోకి తెస్తాం..
- జాతీయ హోదాపై గత ప్రభుత్వం ఎలాంటి దరఖాస్తు చేయలేదని వెల్లడి

(మంథని, ఎలగందల్ టైమ్స్)

కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన మంత్రుల బృందం గత ప్రభుత్వం ధ్వజమెత్తింది. ప్రాజెక్టు పూర్తిగా అవినీతిమయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తాము మొదటి నుంచి చెప్తున్న అనుమానాలే నిజమయ్యాయని.. ప్రాజెక్టు నిర్మాణంలో భారీగా అవినీతి, అవకతవకలు జరిగాయని అన్నారు. శుక్రవారం మేడిగడ్డ బ్యారేజీని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌తో పాటు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే జలయజ్ఞంలో భాగంగా ప్రాజెక్టు-చేవెళ్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని తెలిపారు. కానీ.. రాజకీయం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత నుంచి కాళేశ్వరంకు మార్చిందని చెప్పారు.

2



## బీఆర్ఎస్‌కు షాక్

- జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం
- డీఆర్వోకు నోటీసులు అందించిన 20 మంది సభ్యులు
- చేయని పనులకు బిల్లులు రికార్డు

3



## 5 బృందాలు.. 36 గంటలు

- మిస్ అయిన బాలిక సేఫ్
- జేబీఎస్‌లో పట్టుకున్న కరీంనగర్ పోలీసులు
- వివరాలు వెల్లడించిన రూరల్ ఏసీపీ కరుణాకర్

7





# కమీషన్ల కాళేశ్వరం

- ప్రాజెక్టు పూర్తి అవినీతిమయం
- మా అనుమానాలు నిజమయ్యాయి..
- నిర్మాణంలో భారీగా అవకతవకలు
- మేడిగడ్డ సందర్శనలో మంత్రుల బృందం ధ్వజం
- ప్రాణహిత-చేవెళ్ల నిర్మించి వినియోగంలోకి తెస్తాం..
- జాతీయ హోదాపై గత ప్రభుత్వం ఎలాంటి దరఖాస్తు చేయలేదని వెల్లడి

**(మంథని, ఎలగందల్ టైమ్స్)**

కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన మంత్రుల బృందం గత ప్రభుత్వం ధ్వజమెత్తింది. ప్రాజెక్టు పూర్తిగా అవినీతిమయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తాము మొదటి నుంచి చెప్తున్న అనుమానాలే నిజమయ్యాయని.. ప్రాజెక్టు నిర్మాణంలో భారీగా అవినీతి, అవకతవకలు జరిగాయని అన్నారు. శుక్రవారం మేడిగడ్డ బ్యారేజీని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌తో పాటు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే జలయజ్ఞంలో భాగంగా ప్రాజెక్టు-చేవెళ్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని తెలిపారు. కానీ.. రాజకీయం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత నుంచి కాళేశ్వరంకు మార్చిందని చెప్పారు. గత ప్రభుత్వం ప్రాణహితను నిర్లక్ష్యం చేసిందని, దాన్ని తమ ప్రభుత్వం తిరిగి నిర్మిస్తుందని స్పష్టం చేశారు. ప్రాణహిత ప్రాజెక్టు డిజైన్ మార్చి.. కాళేశ్వరం పేరుతో రీ ఇంజనీరింగ్ చేసిందని, కానీ నిర్మించిన మూడు కీలక బ్యారేజీలూ ప్రస్తుతం పనికిరాకుండా పోయాయని అన్నారు. డ్యామేజీ, లోపాలపై జ్యుడిషియల్ ఎంక్వయిరీ వేయిస్తామని, నిపుణుల నుంచి సలహాలు తీసుకుంటామని చెప్పారు. లక్ష కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన ప్రాజెక్టు ఎటూ పనికిరాకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా సైతం అడగలేదని.. సరైన ఫార్మాట్‌లో వివరాలు సైతం ఇవ్వలేదని తెలిపారు. ఇదే విషయాన్ని హైపవర్ కమిటీ వెల్లడించిందని చెప్పారు. తమ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా అడుగుతామని వెల్లడించారు. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రులకు నీటిపారుదల శాఖ అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.



## కరకట్టలతో ముంపు రైతులను ఆదుకుంటాం: దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోవడంపై సమీక్ష చేస్తున్నామని తెలిపారు. మేడిగడ్డ వద్ద పిల్లర్లు కుంగిపోవడం.. అన్నారం, సుందిళ్ల బ్యారేజ్‌లలో బుడగలు రావడంపై ప్రాజెక్టు పనులలో ఏం జరిగిందో తెలుసుకోవాలని ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. మేడిగడ్డకు రావడం ఓ ప్రత్యేకత ఉందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన మూడు బ్యారేజీలపైనా అనుమానాలు ఉన్నాయని తెలిపారు. ఇంజినీర్లు, అధికారులపై తమకు ఎలాంటి ద్వేషం లేదని.. ఆ రోజు ఏం జరిగిందో అధికారులు ప్రజలకు చెప్పాలని అన్నారు. టెక్నికల్‌గా ఏం జరిగిందో వెల్లడించాలన్నారు. కరకట్టలతో ముంపు రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

## టెండర్లలో చూపిన ఆసక్తి.. నాణ్యతలో చూపలేదు: శ్రీనివాస్ రెడ్డి

గత పాలకులు టెండర్లలో చూపిన ఆసక్తి నాణ్యతలో కానీ, మరమ్మతుల్లో కానీ ఎందుకు చూపలేదని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిలదీశారు. గతంలో వైఎస్సార్ హయాంలో ప్రాణహిత-చేవెళ్ల పనులు ప్రారంభం అయ్యాయని, అప్పుడు 38వేల కోట్ల వ్యయంతో ఒప్పందం కుదిరిందన్నారు. ఎక్కువ వడ్డీలకు అప్పులు తెచ్చి ఈ ప్రాజెక్టు కట్టారని.. పంపులు మునిగాయని అన్నారు. 126 లెవల్‌లో కట్టి ఉంటే పంపులు మునిగేవి కావని చెప్పారు. వరదలు వచ్చినప్పుడు స్టాప్ లాక్ గేట్లు ఎందుకు పనిచేయలేదని ప్రశ్నించారు. అందుకు సంబంధించిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. ఇంత కరెంట్ వ్యయంతో లిఫ్ట్ చేసిన నీరు మళ్లీ గోదారిలో వదిలేస్తారి అని నిలదీశారు. ఉన్న నీటినే సక్రమంగా వాడలేదని, మూడో టీఎంసీ నీటి వినియోగానికి ఎందుకు పనులు మొదలు పెట్టారని పేర్కొన్నారు.

## వెయ్యి కోట్లకు వచ్చే మోటార్లకు.. 4 రెట్లు ఎక్కువ చెల్లించారు: మంత్రి కోమటిరెడ్డి

రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ హయాంలోని ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టును తుమ్మడిహట్టి దగ్గరే కట్టి ఉంటే ఎత్తిపోతలు అవసరం లేకుండా గ్రావిటీ ద్వారానే సాగునీరు అంది ఉండేదని తెలిపారు. దీని ద్వారా రైతులకు లాభం జరిగేదని.. గత ప్రభుత్వ వైఫల్యం, నిర్లక్ష్యంతోనే ఖజానాపై భారీగా భారం పడి ప్రజాధనం దుర్వినియోగమైందని మండిపడ్డారు. వెయ్యి కోట్లకు వచ్చే మోటార్లకు గత ప్రభుత్వం నాలుగు రెట్లు ఎక్కువ చెల్లించిందని.. నాణ్యతలేని లోకల్ అసెంబ్లింగ్ మోటార్లను అమర్చిందని ఆరోపించారు. ఇంజనీర్లు, అధికారులు గత ప్రభుత్వానికి చెప్పి ఉండాల్సిందని సలహాలు ఇవ్వాల్సి ఉండేనని అభిప్రాయపడ్డారు. ఇప్పుడు సాగునీటి ప్రాజెక్టుల పనులను చూస్తుంటే బాధగా ఉన్నదని.. వీటిపై పూర్తి స్థాయిలో విచారణ జరగాలని.. ప్రజలకు వాస్తవాలు తెలియాలని అన్నారు.

## మంచి, చెడులను ప్రజలకు వివరించాలి: పొన్నం ప్రభాకర్

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మానస పుత్రిక అయినటువంటి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎంత నీటిని రైతాంగానికి అందించారు..? ఎంత నీటిని ఎత్తిపోశారు..? ఎంత నీటిని కిందికి వదిలారు..? ఎంత కరెంట్ బిల్లు వచ్చింది..? అనే వివరాలు ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని అన్నారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగడంపై బాంబు దాడి జరిగిందని గత ప్రభుత్వం ఫిర్యాదు చేసిందని.. విచారణలో ఎలాంటి బాంబు దాడి జరగలేదని పోలీసు అధికారులు స్పష్టం చేశారని తెలిపారు. లక్ష కోట్లు ఖర్చుపెట్టి ఆసియా ఖండంలోనే ఇంత పెద్ద సిమెంటు నిర్మాణంతో కట్టిన ప్రాజెక్టు లేదని నాటి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుందని.. తప్పులను వెలుగులోకి తెస్తామని చెప్పారు. భవిష్యత్తులో రైతుల కోసం తమ ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను వివరిస్తామన్నారు. ఈ ప్రాజెక్టు కింద బ్యాక్ వాటర్ ముంపు సమస్య నెలకొని ఉందని.. జరుగుతున్న నష్టంపై చర్యలు తీసుకోవాలని కోరారు.





## రూ.50 వేల కోట్ల అవినీతి: జీవన్‌రెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో రూ.50వేల కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు చేసిన ఖర్చులో సగానికి పైగా అవినీతి జరిగిందన్నారు. దీనిపై సమగ్రమైన విచారణ చేయాలన్నారు. థర్డ్ పార్టీ ఏజెన్సీతో దర్యాప్తు చేపించాలని.. జ్యుడిషియల్ విచారణ సమాంతరంగా వేరేగా జరుగుతుందని.. వాస్తవాలను తెలపాలని కోరారు. ప్రజల భూములు పోయినా పరిష్కారం లేదని.. కాళేశ్వరానికి జరిగిన ఖర్చులో ఎల్లంపల్లికి ఎగువ, దిగువ ప్రాంతాల్లో ఎంతెంత అయిందో చెప్పాలని ప్రశ్నించారు.

# బీఆర్ఎస్‌కు షాక్

- జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం
- డీఆర్వోకు నోటీసులు అందించిన 20 మంది సభ్యులు
- చేయని పనులకు బిల్లులు రికార్డు చేశారని ఆరోపణ

(జమ్మికుంట, ఎలగందల్ టైమ్స్)

*జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. అవిశ్వాస తీర్మానాలు ఆ పార్టీని భయపెడుతున్నాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీ అధికారం కోల్పోవడంతో ఎక్కడికక్కడ ముసలం మొదలైంది. మున్సిపాలిటీలు, మండల పరిషత్‌లలో ఆ ఎఫెక్ట్ కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. ఇటీవల రామడుగు ఎంపీపీ కలిగేటి కవిత-లక్ష్మణ్ పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా.. తాజాగా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. 30 మంది సభ్యుల్లో 20 మంది తిరుగుబావుటా ఎగురవేశారు.*

**చేయని పనులకు బిల్లులు**

జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావుపై కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. డీఆర్ఓ పవన్ కుమార్‌కు అవిశ్వాస తీర్మానాన్ని అందజేశారు. మెజారిటీ కౌన్సిలర్లు చైర్మన్‌కు వ్యతిరేకంగా నోటీసులు అందజేశారు. రాజేశ్వరరావు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎజెండా తయారుచేసి, చేయని పనులకు బిల్లులు పెట్టి రికార్డు చేశారని, డీజిల్, బ్లీచింగ్ పౌడర్ ఖర్చు పేరిట, ఎక్కువ మొత్తంలో బిల్లులు పెట్టి డబ్బులు డ్రా చేశారని ఆరోపించారు. పట్టణ ప్రగతి నిధులు, వార్డులలో చేయని పనులకు రికార్డులు చేయించి బిల్లులు డ్రా చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే.. సద్దుల బతుకమ్మ, దసరా, గణేశ్ నిమజ్జనం టెండర్లను పిలవకుండానే చైర్మన్ పనులు చేసుకుని రికార్డు చేయించుకొని లక్షల రూపాయలు డ్రా చేసినట్లు అవిశ్వాస తీర్మానంలో పేర్కొన్నారు. 20 మంది కౌన్సిలర్లు శుక్రవారం ప్రత్యేక బస్సులో జమ్మికుంట నుంచి కరీంనగర్ చేరుకొని డీఆర్ఓకు నోటీసులు ఇచ్చారు. అయితే.. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావుతోపాటు మరికొంతమంది కౌన్సిలర్లు కరీంనగర్ చేరుకొని అవిశ్వాసానికి వెళ్లకుండా వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. కానీ.. ఆ ప్రయత్నాలు ఫలించలేదు. అయితే.. అక్కడ చిన్నపాటి



వాగ్వివాదం చోటు చేసుకోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో గొడవ సద్దుమణిగినట్లు తెలిసింది. నోటీసుల అనంతరం కౌన్సిలర్లు ప్రత్యేక మినీ బస్సులో హైదరాబాద్‌కు వెళ్లినట్లు సమాచారం.

**తెరపైకి మల్లయ్య..**

సీనియర్ నేత, కౌన్సిలర్ అయిన పొనగంటి మల్లయ్య నేతృత్వంలోనే మిగితా కౌన్సిలర్లంతా ఈ అవిశ్వాసం తీర్మానం ఇచ్చారు. జమ్మికుంటలో 30 వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ 27 గెలిచింది. మిగితా ఆ ముగ్గురు కూడా తదుపరి పరిణామాలతో బీఆర్ఎస్‌లో చేరారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలకు ముందు మల్లయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముందు నుంచి చైర్మన్‌పై వ్యతిరేకతతో ఉన్న మల్లయ్య.. సమయం కోసం వేచిచూశారు. ముందు నుంచి చైర్మన్ పదవి ఆశించినా ఆయనకు దక్కలేదు. దీంతో తాజాగా అవిశ్వాసం నోటీసులు అందించారు. కాగా.. తదుపరి చైర్మన్ రేసులో ఆయనే ఉన్నట్లు తెలుస్తోంది.

## 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించాలి

- గత ప్రభుత్వంలో అన్యాయం జరిగింది
- సీపీఐ జాతీయ నేత చాడ వెంకటరెడ్డి

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2008లో నిర్వహించిన డీఎస్సీలో క్వాలిఫై అయిన నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వారికి తీరని అన్యాయం జరిగిందని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి ఉద్యోగాలు ఇచ్చి వారిని ఆదుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి కోరారు. 2008 డీఎస్సీ అభ్యర్థులు శుక్రవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో చాడకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ 2008లో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి డీఎస్సీ నిర్వహించిందని, అందులో క్వాలిఫై అయిన నిరుద్యోగులకు అనివార్య కారణాల వల్ల ఉద్యోగాలు ఇవ్వకుండా తాత్కాలిక బ్రేకప్ పేరుతో నిలిపివేయడంతో వారంతా హైకోర్టుకు వెళ్లారని, నాడు తాను ఎమ్మెల్యేగా, సీపీఐ ఫ్లోర్ లీడర్ గా ఉన్న సమయంలో వారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి చాలా ప్రయత్నం చేసినప్పటికీ వారికి



న్యాయం జరగలేదని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 లో తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం ఏర్పడి ముఖ్యమంత్రి కేసీఆర్ దగ్గరకు అభ్యర్థులను తీసుకువెళ్లి వారికి ఉద్యోగాలు కల్పించాలని కోరానని చెప్పారు. నాడు మంత్రిగా ఉన్న హరీష్ రావు కూడా మద్దతు తెలిపారని అన్నారు. అప్పటి విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి పెండింగులో పెట్టారని విమర్శించారు. వినతిపత్రం అందజేసిన వారిలో భూక్య తిరుపతి నాయక్, సమిత, జలపతి రెడ్డి, శ్రీనివాస్, ప్రసాద్ ఉన్నారు.

## జాతీయ స్థాయి క్రికెట్‌లో అల్ఫోర్స్ విద్యార్థి ప్రతిభ

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** విద్యార్థులకు క్రీడల పట్ల అవగాహన కల్పించి.. అందులో పాల్గొనేలా ఉత్సాహాన్ని నింపాలని, వసతులు కల్పించాలని, తద్వారా వారు అద్భుత విజయాలను నమోదు చేయడమే కాకుండా పోటీతత్వాన్ని అలవర్చుకుంటారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. రేకుర్తిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్ విద్యార్థి జాతీయ స్థాయి క్రికెట్ పోటీలలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు సాధించడంపై అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు వివిధ క్రీడల పోటీలలో పాల్గొని అద్భుతమైన విజయాలను సాధించి సమాజంలో ముందంజలో నిలవాలని కోరారు. ఈ నెల 5వ తేదీన జోగులాంబ గద్వాల్ జిల్లాలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రికెట్



పోటీలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రికెట్ టీంకు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చూపాడని హర్షం వ్యక్తం చేశారు.

## మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ పోస్ట్ పోన్ చేయాలి

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రోగ్రాం కొనసాగుతోందని.. ఈ క్రమంలో ప్రజలకు సూచనలు, సలహాలు ఇవ్వడానికి కార్పొరేటర్లు, మున్సిపల్ ఆఫీసర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని.. అందుకే కౌన్సిల్ మీటింగ్ వాయిదా వేయాలని 49వ డివిజన్ కార్పొరేటర్ సోహన్ సింగ్, కమల్ జిత్ కౌర్ కోరారు. మీటింగ్ పోస్ట్ ఫోన్ చేసి జనవరి 6వ తారీకు తర్వాత పెట్టాలని కోరారు. కరీంనగర్ ప్రజా పాలన ప్రజలకు



ఇబ్బంది కలగకుండా చూడాలని కమిషనర్ భువనగిరి శ్రీనివాస్ వినతిపత్రం అందించారు.

### వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం
## రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రవణ్



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** తెలంగాణ స్టేట్ వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం సమావేశం స్థానిక వరంగల్‌లోని కృషి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అశోక్, రామకృష్ణారెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా వై.శ్రవణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చెప్యాల రాము, కోశాధికారిగా పంజాల రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



## అయ్యప్ప పడిపూజ

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** శాస్త్రీ రోడ్డులో మతిన్ అండ్ ఫ్రెండ్స్ చారిటెబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప భజనలతో ప్రాంగణమంతా భక్తి పారవశ్యంతో మారుమోగింది. అనంతరం అయ్యప్ప దీక్షాపరులకు సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారు. ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి, నరేందర్, గురుస్వాములు, అయ్యప్ప దీక్షాపరులు, తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిల్ మీటింగ్ వాయిదా..

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** ప్రజా పరిపాలన కార్యక్రమం నేపథ్యంలో కరీంనగర్ నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు నగర మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించాలని నిర్ణయం తీసుకొని.. తేదీని ఖరారు చేసి ఎజెండా కాపీలను పాలకవర్గం సభ్యులకు పంపిణీ చేశారు. ఈ సమయానికి ప్రజా పాలనకు సంబంధించిన ఎలాంటి తేదీ ఖరారు కాలేదన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని సర్వసభ్య సమావేశం నిర్వహించాలనుకున్నామన్నారు. నగరపాలక సంస్థకు చెందిన అధికారులు, సిబ్బంది ప్రజా పాలన కార్యక్రమం విధులు నిర్వహించడం జరుగుతుంది కాబట్టి సమావేశం నిర్వహిస్తే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. అందుకే సమావేశం వాయిదా వేశామని మేయర్ తెలిపారు. ప్రజా పాలన పూర్తిగా ముగిసిన తర్వాత తేదీని నిర్ణయిస్తామని స్పష్టం చేశారు.



# అన్ని గ్యారెంటీలు అమలు చేస్తాం..

## మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

**మానకొండూర్, ఎలగందల్ టైమ్స్:** కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలలో రెండు ఇప్పటికే అమల్లోకి తెచ్చామని.. మరో 4 గ్యారెంటీలను రానున్న రోజుల్లో అమలు చేస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. బెజ్జంకి మండలం గుగ్గిల్ల గ్రామంలో ప్రజా పాలనను ప్రారంభించి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అలాగే.. గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజన వివరాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థులకు మంచి విద్యను అందించి ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కల్పించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా పాఠశాల నిర్మాణం కోసం అధికారులతో కలిసి స్థలాలను పరిశీలించారు. అనంతరం గునుకులకొండాపూర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు.





# ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** కరీంనగర్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం తీసుకునే ముందస్తు చర్యల్లో భాగంగా, ప్రయాణికులకు భద్రత కలిగించే దిశగా కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి ఆదేశాల మేరకు శుక్రవారం కమిషనరేట్ కేంద్రంలోని జాన్ విల్సన్ ఓపెన్ ఎయిర్ థియేటర్ లో దాదాపు 500 మంది ఆటో డ్రైవర్స్ కు అడిషనల్ డీసీపీ శాంతిభద్రతలు ఎ.లక్ష్మినారాయణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ప్రతీ ఆటో వెనక భాగంలో టాప్ నెంబర్ తప్పక కలిగి ఉండాలన్నారు. దానికి సంబంధించి ట్రాఫిక్ పోలీసులు అందించిన ఫారం నింపి పోలీస్ స్టేషన్లో మూడు రోజుల్లోగా అందించాలన్నారు. డ్రైవర్స్ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు ఆటోకు సంబంధించిన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. ఆటో నడిపే సమయంలో విధిగా యూనిఫామ్ ధరించాలన్నారు. మైనర్లు ఆటో నడిపి పట్టుబడితే డ్రైవర్ తోపాటు ఆటో యజమానిపై కేసు నమోదుచేస్తామన్నారు. మద్యం సేవించి వాహనం నడపకుడదన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు నరేందర్ (టౌన్), కరుణాకర్ రావు (రూరల్), సర్వర్ (ట్రాఫిక్), ఇన్స్పెక్టర్లు రవికుమార్ (వన్ టౌన్), ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు రమేష్, ఖరీముల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.





# గ్యారెంటీలన్నీ ప్రజలకు అందేలా చూస్తాం

## నగర మేయర్ యాదగిరి సునీల్ రావు

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** అభయహస్తం ఆరు గ్యారెంటీలను ప్రజలకు పూర్తి స్థాయిలో అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. కరీంనగర్ లో శుక్రవారం 33,34 వ డివిజన్ లో పర్యటించారు. రెండో రోజు భగత్ నగర్ పోలీస్ క్యార్టర్స్ ప్రభుత్వ పాఠశాల, గోదాంగడ్డలో జరిగిన ప్రజా పాలన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పలువురికి దరఖాస్తులను అందజేశారు. పలు దరఖాస్తులను తన చేతుల మీదుగా స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రజలు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా వారికి అండగా నిలబడుతామన్నారు. రెండో రోజు ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా 2,7,13,15,19,21,26,34, 46,49 డివిజన్ లలో డివిజన్ సభలు జరిగాయని.. ప్రజలకు ప్రజా పాలన సంక్షేమ పథకాలు, దరఖాస్తు పూరించే విధానంపై అవగాహన కల్పించామన్నారు. పథకాలు అర్హులందరికి అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

**కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ**

33వ డివిజన్ భగత్ నగర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మేయర్ పలువురికి కళ్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. 33వ డివిజన్ కు చెందిన ముగ్గురికి అందజేశారు.









## కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రికి వినతి

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** కేంద్ర ఆరోగ్య శాఖ రసాయన, ఫర్టిలైజర్స్ శాఖ మంత్రి విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కొండి శెట్టి సురేష్ బాబు సన్మానించారు. గ్రామీణ వైద్యుల సమస్యలు నాటి నుండి నేటి వరకు పరిష్కారం కాలేదని, కరోనాతో చనిపోయిన వారిని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. వృత్తి భద్రత, చట్టబద్ధత, వైద్య శాఖలో గ్రామీణ వైద్యులకు అవకాశం 60 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్, ఉచిత ఇల్లు, బస్ పాసుల సౌకర్యం కల్పించాలని కోరారు. ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు చింతలపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




# అభయహస్తం సద్వినియోగం చేసుకోవాలి

- ఉచిత దరఖాస్తు ఫారాలకు ఎంఐఎం కార్యాలయంలో సంప్రదించండి
- ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ కోరారు. శుక్రవారం నగరంలోని గోదాం గడ్డ ప్రాంతంలో 34 వ డివిజన్ లో ప్రజా పాలనలో భాగంగా అభయహస్తం ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ షాకిర అంజుమ్ బర్కత్ అలీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా ఆయా ప్రభుత్వాలు ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందేలా కృషి చేయడంలో భాగంగా వారికి సహాయ సహకారాలు అందించడంతోపాటు సేవ చేయడమే ఎంఐఎం పార్టీ లక్ష్యమన్నారు. ప్రజలం దరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ పథకాలను పొందాలని పిలుపునిచ్చారు. దరఖాస్తు ఫారాలు ఉచితంగా పొందేందుకు ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లతో పాటు దారుస్సలాం ఎంఐఎం పార్టీ కార్యాలయంలో, ఎంఐఎం పార్టీ నగరంలో 40 డివిజన్ల వ్యాప్తంగా తమ డివిజన్ల అధ్యక్షుల వద్ద దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అదనపు కమిషనర్, డివిజన్ ప్రత్యేక అధికారి శరణ్య, ఆర్పీ సునీత, కాంగ్రెస్ నేత రాము, డివిజన్ పెద్దలు పాల్గొన్నారు.




# వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** కరీంనగర్‌లోని వాసవీ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీరోడ్డులో నివసించే వృద్ధులు, నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్ హాజరయ్యారు. వృద్ధులు చలి తీవ్రత ను తట్టుకునేందుకు వాసవీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇట్టి కార్యక్రమం చేపట్టామని చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్ తెలిపారు. వాయిపుత్ర సేవా సమితి ప్రతినిధి దండు మధు సూచనల మేరకు అందజేశామని తెలిపారు. ఏటా చిట్టుమల్ల శ్రీనివాస్ సేవా కార్యక్రమాలు చేపడుతుంటా రని.. ఆయన సుఖసంతోషాలతో ఉండాలని వృద్ధులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కాచం రాజేశ్వర్, కోశాధికారి బొల్లం శ్రీనివాస్, వాయుపుత్ర సేవా సమితి ప్రతినిధి దండు మధు పాల్గొన్నారు.



## విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలి

### ఏబీవీపీ హుస్నాబాద్ నగర కార్యదర్శి రాకేష్

**హుస్నాబాద్, ఎలగందల్ టైమ్స్:** రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల విద్యార్థులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని, బస్సులు సమయానికి రాక కళాశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఏబీవీపీ హుస్నాబాద్ నగర కార్యదర్శి రాకేష్ అన్నారు. విద్యార్థులు తిరిగి ఇంటికి వెళ్లడానికి దాదాపు రాత్రి 9 గంటల సమ యం పడుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కళాశాల విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్ర త్యేక బస్సులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనియెడల రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి సందీప్, రాజు, డిగ్రీ కళాశాల కార్యదర్శి రాహుల్ పాల్గొన్నారు.









# యువత దేశ సంస్కృతి, సంప్రదాయలను కాపాడాలి

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** మనదేశ సంస్కృతి, సాంప్రదాయాలను యువత కాపాడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లా యువజన మరియు క్రీడ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు (యువ కళాకారుల ఎంపిక ) పోటీలను  జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా  జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతు యువతలో ఉన్న ప్రతిభను వెలికి తీయటానికి యువజన ఉత్సవాలు ఎంతో గానో దోహదపడతాయన్నారు. కళాకారులు మన జిల్లా  ఖ్యాతిని జాతీయస్థాయిలోకి తీసుకువెళ్లాలని చెప్పారు, దేశానికి యువత వెన్నెముక అని యువత తలుచుకుంటే సాధించనది ఏమి లేదని, యువత చేతులోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. స్వామి వివేకానందుని ఆశయాలను,ఆదర్శాలను యువత మరువ రాదని అన్నారు. జిల్లా యువజన క్రీడా అధికారి కీర్తి రాజావీరు మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని జాతీయస్థాయిలోకి పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేల సత్పతి కి యువజన సంఘాల ప్రతినిధులు మెమొంటో జ్ఞాపిక ఇచ్చి స్వాగతం పలకడం జరిగింది. అనంతరం జిల్లా యువ కళాకారు ఎంపిక పోటీలను కలెక్టర్ తిలకించారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డ్ గ్రహీత రెండ్ల కళింగ శేఖర్, రాష్ట్ర యువజన అవార్డ్ గ్రహీత సత్తినేని శ్రీనివాస్ పల్లవి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వొడ్నాల రాజు, యువజన ప్రతినిధులు బోనాల సంపత్, సంగం రాధాకృష్ణ ,జల్లోజు శ్రీనివాస్, అఫ్రోజ్  న్యాయ నిర్ణేతలు,కళాకారులు తదితరులు పాల్గొన్నారు.









# సీపీఎం ప్లీనరీని విజయవంతం చేయండి

## జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** గత కార్యక్రమాలను సమీక్షించుకొని, భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించుకునేందుకు శనివారం ముకుంద లాల్ మిశ్రాభవన్‌లో నిర్వహించే సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. దేశంలో, రాష్ట్రంలో పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, ప్రజలపై వాటి ప్రభావాలు, ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకునుటకు ఈ ప్లీనరీ సమావేశం తోడ్పడుతుందన్నారు. ఈ ప్లీనరీ సమావేశానికి రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ, దేశ సంపదను కార్పోరేట్ శక్తులకు తాకట్టు పెడుతున్న బిజెపినీ ఎక్కడ, ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆస్తులు అన్ని అంబానీ, అదా ని లాంటి కార్పొరేట్ కుబేర్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



# 48వ డివిజన్‌లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** ప్రజా పాలన దరఖాస్తులను కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 48 డివిజన్ భారత్ టాకీస్ సమీపంలో డిప్యూటీ కమిషనర్ స్వరూప రాణి పర్యవేక్షణలో స్వీకరించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు దరఖాస్తు చేసుకునేందుకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఇందులో భాగంగా సిటీ కాంగ్రెస్ అధికార ప్రతినిధి పోరండ్ల రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వంగల విద్యాసాగర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాగుల సతీష్ సహకారంతో ప్రజలకు అవగాహన కల్పించారు.

## ఎస్ఎఫ్ఐ జెండా ఎత్తి

# విద్యార్థులు కదలాలి



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ వేడుకలకు విద్యార్థులు తరలిరావాలని జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతోందని పేర్కొన్నారు. ఎందరో మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని.. వారి ఆశయ సాధన కోసం నిరంతరం పనిచేస్తున్నట్లు తెలిపారు. దేశంలో అత్యధికం సభ్యత్వం కలిగి ఎస్ఎఫ్ఐ మొదటి స్థానంలో ఉండడం గర్వకారణం అని పేర్కొన్నారు.

# 5 బృందాలు.. 36 గంటలు

- మిస్ అయిన బాలిక సేఫ్
- జేబీఎస్‌లో పట్టుకున్న కరీంనగర్ పోలీసులు
- వివరాలు వెల్లడించిన రూరల్ ఏసీపీ కరుణాకర్



(కరీంనగర్, ఎలగందల్ టైమ్స్)

అమ్మమ్మ ఊరి నుంచి ఇంటికి వచ్చేందుకు బస్సు ఎక్కిన బాలిక కరీంనగర్ బొమ్మకల్ బైపాస్ వద్ద బుధవారం అదృశ్యం కాగా.. ఎట్టకేలకు పోలీసులకు చిక్కింది. దీంతో బాలిక మిస్సింగ్ కథ సుఖాంతమైంది. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ఊటూర్ గ్రామానికి చెందిన బాలిక రెండు రోజులు క్రిస్మస్ సెలవులు ఉండటంతో అమ్మమ్మ ఊరు పెద్దపల్లికి వెళ్లింది. సెలవులు పూర్తవ్వడంతో బుధవారం ఉదయం ఆమె తాతయ్య పెద్దపల్లిలో కరీంనగర్ బస్సు ఎక్కించాడు. తాతయ్య అమ్మాయి తండ్రికి బస్సు నెంబర్ మెసేజ్ చేశాడు. కాగా.. ఆ బాలిక తండ్రి కరీంనగర్– మంచిర్యాల చౌరస్తా స్టేజీ దగ్గర తండ్రి ఎదురుచూస్తూ ఉండిపోయాడు. ఇంతలోనే బస్సు వచ్చింది కానీ.. అమ్మాయి కనిపించలేదు. కండక్టర్‌ను అడగగా అమ్మయి బైపాస్ లోనే దిగినట్లు చెప్పాడు. వెంటనే అతను బైక్‌పై బైపాస్ దగ్గర వెళ్లి చూడగా బాలిక ఆచూకీ లభించలేదు. ఎట్టకేలకు గురువారం అర్ధరాత్రి సికింద్రాబాద్‌లోని జేబీఎస్‌లో బాలికను పట్టుకున్నారు.

**కరీంనగర్ నుంచి హైదరాబాద్ వరకు..**

దీనికి సంబంధించిన వివరాలను కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్ శుక్రవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం బాలిక బస్సు దిగి అదృశ్యమైందని.. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. సీపీ అభిషేక్ మహంతి సూచనలతో బాలిక గాలింపు కోసం ఐదు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాలిక ముందుగా కరీంనగర్‌లో బస్సు దిగి.. ఆ తర్వాత కరీంనగర్ బస్టాండ్‌కు ఆటోలో చేరుకుందని చెప్పారు. అనంతరం అక్కడి నుండి హైదరాబాద్, జగిత్యాల వివిధ బస్సులలో ప్రయాణం చేసింది. జగిత్యాల వెళ్లే క్రమంలో ఓ యువకుడు సోషల్ మీడియాలో చూసి బాలిక జగిత్యాల వెళ్తున్నట్లు.. తనతో ప్రయాణం చేసినట్లు పోలీసులకు సమాచారమిచ్చాడు. వెంటనే అప్రమత్తమయిన పోలీసులు జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిలో వెతికారు. ఆయా బస్టాండ్‌ల పరిసరాల్లోని సీసీ కెమెరాలు వెతికినా బాలిక ఆచూకీ లభించలేదు. అనంతరం బాలిక గురువారం అర్ధరాత్రి జగిత్యాల నుండి వరంగల్, అక్కడ నుండి నిజామాబాద్ నుండి హైదరాబాద్‌కు చేరుకుంది. అక్కడ వెతుకుతున్న కరీంనగర్ పోలీసుల బృందానికి ఓ ఆటో డ్రైవర్ సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఆమెను కరీంనగర్‌కు తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా.. ఐదు బృందాలు కష్టపడి తిరిగి 36 గంటల్లోనే పట్టుకున్నట్లు ఏసీపీ వెల్లడించారు. ఈ సందర్భంగా సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్, ఎస్సై వెంకట్రాజం పాల్గొన్నారు.

**పేరెంట్స్ పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలి**

తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలని ఈ సందర్భంగా రూరల్ ఏసీపీ సూచించారు. తమ ఇబ్బందులను పేరెంట్స్‌కు ఫ్రీగా చెప్పుకునే వాతావరణం కల్పించాలన్నారు. ఎవరైనా అసభ్యంగా తాకినా.. ఏదైనా బాధ అనిపించినా చర్చించే పరిస్థితి ఉండాలని సూచించారు. ఈ బాలిక విషయంలోనూ అదే జరిగిందని.. స్కూల్ హాస్టల్‌కు వెళ్లాలని ఇష్టం లేకనే ఇలా చేసిందని తెలిపారు. తమ విచారణలో అదే వెల్లడైందని తెలిపారు. ఇంటికి వెళ్తే మళ్లీ పేరెంట్స్ హాస్టల్‌కు పంపిస్తారని భయపడిందని పేర్కొన్నారు.



## ప్రజా పాలనకు విశేష స్పందన

- నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** ప్రజా పాలన దరఖాస్తు స్వీకరణకు ప్రజల నుండి విశేష స్పందన వస్తోందని, ఆరు గ్యారెంటీలతోపాటు రేషన్ కార్డులు ఇతర సమస్యల కోసం ప్రజలు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకుంటున్నారని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి చెప్పారు. నగరంలోని 2,19,13,34 డివిజన్లలో దరఖాస్తు సెంటర్లను సందర్శించి దరఖాస్తుదారులతో మాట్లాడారు. 13వ డివిజన్లో వికలాంగుడు ఓర్సు శ్రీనివాస్‌కు కుడిచేయి లేనిది గమనించిన నరేందర్ రెడ్డి అతని దరఖాస్తు ఫారం నింపారు. రిజిస్టర్‌లో నమోదు చేయించి రశీదు ఇచ్చారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు దరఖాస్తు సెంటర్ల వద్ద ఉండి సహకరించాలని కోరారు. కూన దామోదర్, మూల రవీందర్ రెడ్డి, అస్తపురం రమేష్, ఎంఏ నవాజ్, కొట్టే రాము, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కీర్తి కుమార్, మహమ్మద్ భారీ, శేహెన్ష, ఇమ్రాన్, పెద్దిగారి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.







## టీఎన్జీఓ జాతీయ సమావేశాలకు జిల్లా నేతలు

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలకత్తాలో జాతీయ స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ మేరకు రాష్ట్ర టీఎన్జీవోల సంఘ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.. సుమారు 29 రాష్ట్రాల ప్రతినిధులతోపాటు తెలంగాణ నుండి 33 జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జాతీయ స్థాయి సమస్యలైన సీపీఎస్ విధాన రద్దు, పీఎఫ్ఆర్డీఏ చట్టం రద్దు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల యొక్క రెగ్యులరైజేషన్, ఇన్కమ్ టాక్స్ పరిధిని పదిలక్షలకు పెంచాలని డిమాండ్లను పరిష్కరించాలంటూ తీర్మానించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు రాగి శ్రీనివాస్, అర్బన్ అధ్యక్షులు సర్దార్ హర్మీందర్ సింగ్, రూరల్ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, తిమ్మాపూర్ యూనిట్ అధ్యక్షులు పోలు కిషన్, జిల్లా జాయింట్ సెక్రటరీ బాస పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల పెంపకందారుల ఎన్నికలు నిర్వహించాలి

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** కరీంనగర్ జిల్లా ప్రాథమిక గొర్రెల పెంపకదారుల సహకార సంఘం జిల్లా యూనియన్ ఏర్పాటు చేయాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బి.నరేందర్‌కు ప్రాథమిక గొర్రెల పెంపకదారుల సహకార సొసైటీ అధ్యక్షులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గొర్రెలు మేకల పెంపకదార్ల సంఘం జిల్లా కార్యదర్శి కాల్వ సురేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాలకు నవంబర్ 2022 నుండి ఎన్నికలు నిర్వహిస్తున్నారని, ఇప్పటికీ 88 సంఘాలకు ఎన్నికలు పూర్తయ్యాయని, ఎన్నికల ప్రక్రియలో మరో 26 సంఘాలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో సహకార సంఘాల అధ్యక్షులు దాడి ఆంజనేయులు, చిగుళ్ల కొమురయ్య, పుట్ట కొమురయ్య, పంబాల లక్ష్మన్, బనుక తిరుపతి, చిమ్మల్ల మహేష్, చెన్నవేణి అనిల్, పాశం వేణు, బొమ్మెన పరుషరాములు, జినుక కుమార్ పాల్గొన్నారు.




ఎలగందల్ టైమ్స్‌లో వార్తల కోసం ఈ నంబర్లలో సంప్రదించగలరు : 97054 44375, 93982 24202


EDITOR,PRINTER, PUBLISHER AND OWNED BY VONTELA KRISHNA, PRINTED AT M/S SAI VEERANJANEYA PRINTERS HNO.8-1-109,KATTARAMPUR,TOWN, MANDAL AND DIST KARIMNAGAR-505001.TELANGANA STATE. PUBLISHED AT HNO.5-6-416/1,KAPUWADA,MARUTHINAGAR, KARIMNAGAR-505001.TELANGANA STATE. EDITOR: VONTELA KRISHNA.9849731222, EMAIL I'D:KRISHNA.VONTELA@GMAIL.COM